



స్వామివారికి పెండ్లి కుమారుడి బొట్టు పెడుతున్న అర్చకస్వామి

'అనంత' పెత్తనం

- ప్రత్తిపాడు వైసీపీలో ఎమ్మెల్సీ అనంతబాబు హవా
- నియోజకవర్గ ఇన్చార్జి వరుపులను వెంటబెట్టుకుని ఎన్నికల ప్రచారం
- నేతలు, కార్యకర్తలతో సమీక్షలు, ఎన్నికల వ్యూహాలతో హడావుడి
- ఇన్నేళ్లు నియోజకవర్గం వైపే చూడని వ్యక్తి ఇప్పుడు 'ప్రత్యేక దృష్టి'పై సర్వత్రా చర్చ
- మైనింగ్ నిల్వల కోసమే కాకినాడ కీలక నేతతో కలిసి స్కెచ్ అంటూ ప్రచారం
- అటు అనంతబాబు అతి జోక్యంపై నెత్తీనోరుబాదుకుంటున్న పార్టీ నేతలు, కేడర్
- డ్రైవర్ హత్య కేసులో ఇరుక్కుని జైలుపాలై వచ్చి ఇక్కడ పెత్తనమేంటని ఆగ్రహం
- వేలల్లో ఉన్న దళిత ఓటు బ్యాంకు పార్టీకి ఎక్కడ దూరమైపోతుందోనని కలవరం
- దీన్ని సోషల్ మీడియాలో ప్రశ్నించిన పార్టీ కేడర్‌కు అప్పుడే బెదిరింపులు కూడా

ఆయన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు. తన దగ్గర పనిచేసే డ్రైవర్ హత్య కేసులో ఆరోపణలతో జైలుపాలయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ హత్య సంచలనమవడంతో పార్టీ కూడా ఈయన్ను సస్పెండ్ చేసింది. కానీ ఇప్పుడాయన తనది కాని నియోజకవర్గంలో దర్జాగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పోనీ అభ్యర్థా అంటే కాదు. అసలు అభ్యర్థిని పక్కనపెట్టి పూర్తిగా నియోజకవర్గం అంతటా తనదైన పెత్తనం చేస్తున్నారు. కేడర్‌తో సమావేశాలు, ఎన్నికల వ్యూహాలు.. ఒకటేంటి అసలు అభ్యర్థిని మించి అతి చేసేస్తున్నారు. వైసీపీ పెట్టిన ఇన్నేళ్లలో రంపచోడవరం మినహా అసలు ఈ నియోజకవర్గంపైనే కన్నెత్తి చూడని ఈయన ఇప్పుడు ప్రత్యేక దృష్టిసారించడంపై సర్వత్రా పార్టీలో చర్చ జరుగుతోంది. ఇక్కడున్న అపారమైన మైనింగ్ నిల్వలపై కన్నేసి కాకినాడ కీలక నేతతో కలిసి ఈ నియోజకవర్గంపై స్కెచ్ వేశారనే ప్రచారం జరుగుతోంది. అటు పార్టీ నేతలు, కేడర్ సైతం ఈయన పెత్తనంతో అప్పుడే నెత్తీనోరు బాదుకుంటున్నారు. హత్య కేసులో ఇరుక్కున్న ఇతని వల్ల దళితుల ఓట్లు పార్టీకి దూరమైపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇంతకీ ఆ నియోజకవర్గం ఏంటనుకున్నారు... అదే ప్రత్తిపాడు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు అకస్మాత్తుగా ప్రత్తిపాడు నియోజకవర్గంపై ప్రేమ పుట్టుకురావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వైసీపీ స్థాపించినప్పటి నుంచి ఈయన పూర్తిగా రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంగానే రాజకీయం చేస్తున్నారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచేందుకు ఎన్నిసార్లు ప్రయత్నాలు చేసినా కుల ధ్రువీకరణ సమస్య కారణంగా పోటీకి కుదరలేదు. దీంతో తన కనుసన్నల్లో ఉండే నేతలకు సీట్లు ఇప్పిస్తూ వారు గెలిచిన తర్వాత తనే షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పుతూ వస్తున్నారు. అయితే ఎప్పుడూలేనిది ఇప్పుడు కొత్తగా ప్రత్తిపాడు నియోజకవర్గంపై కన్నేసి పెత్తనం చేస్తుండడంతో వైసీపీలో గందరగోళం రేగుతోంది. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు ఇక్కడి నుంచి వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం సీటు నిరాకరించింది. ఈయన స్థానంతో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు టికెట్ ఇచ్చింది. ఈనేపథ్యంలో పార్టీ నేతలు పర్వత నియంతృత్వ బెడద తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు. కానీ అనూహ్యంగా ఇప్పుడు నియోజకవర్గంలో రంపచోడవరం నియోజకవర్గ నేత అయిన అనంతబాబు పెత్తనం పెరగడంతో నెత్తీనోరు బాదుకుంటున్నారు. గడచిన కొన్నిరోజులుగా ఇన్చార్జి వరుపులను పక్కనపెట్టి మరీ అనంతబాబు అతి జోక్యంతో సమావేశాలు, నేతలతో సమీక్షలు చేస్తున్నారు. ఎన్నికల వ్యూహాలను కూడా ఈయన అమలుచేస్తున్నారు. నియోజకవర్గ ఇంచార్జి వరుపుల సుబ్బారావు ఎక్కడ ప్రచారానికి వెళ్లాలో ఈయనే నిర్ణయించడంతో పాటు కూడా వెంటే వెళ్తున్నారు. దీంతో పార్టీలో ఈయన మితిమీరిన జోక్యంపై నేతలు, కేడర్ తలలు పట్టుకుంటున్నారు. వరుపుల ఆధ్వర్యంలో పనిచేయాలనుకుంటున్న తమపై అనంతబాబు పెత్తనమేమిటో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. వాస్తవానికి వరుపుల సుబ్బారావుకు అనంతబాబు సొంత మేనల్లుడు. ఈ కారణంతో నియోజకవర్గంలో సహకారం కోసం తిరుగుతున్నారని తొలుత నేతలు భావించారు. కానీ అది కాస్తా ఇన్చార్జిని మించి పెత్తనం చేస్తుండడంతో పార్టీ కేడర్ గుర్రుగా ఉన్నారు. తన డ్రైవర్ హత్య కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అనంతబాబుపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు నెలకొన్నాయి. అటు దళిత వర్గాల్లోను తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ నేపథ్యంలో అవన్నీ కాదని నియోజకవర్గంలో పార్టీని గుప్పిట పెట్టుకుని తిరుగుతుండడంతో ఆ సామాజికవర్గ ఓట్లు ఎన్నికల్లో పార్టీకి దూరమైపోతాయని నేతలు, కేడర్ ఆందోళన చెందుతున్నారు. 32 వేలకుపైగా ఉన్న దళిత సామాజికవర్గం ఓట్లు అనంతబాబు వల్ల పార్టీకి చెదిరిపోతాయని కలవరపడుతున్నారు. వాస్తవానికి వరుపుల సుబ్బారావు ఆర్థికంగా బలహీనంగా ఉండడంతో రాబోయే ఎన్నికల్లో ఖర్చును అనంతబాబుతో పెట్టించేలా వైసీపీ అధిష్ఠానం పరోక్షంగా ఆదేశాలు ఇచ్చింది. ఇటీవల సీఎం జగన్ కూడా ఈయన్ను తాడేపల్లి పిలిపించి మాట్లాడారని సమాచారం. అయితే ఆర్థిక అండదండల సాకుతో ఏకంగా ఇన్చార్జిని ఎన్నికల ముందే డమ్మీ చేయడంతో పార్టీలో చిచ్చు రేగుతోంది. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు పార్టీ కేడర్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కానీ అంతలోనే అనంతబాబు మనుషుల నుంచి వార్నింగ్‌లు వెళ్లడంతో నెమ్మదించినట్టు విశ్వసనీయ వర్గాల భోగట్టా.



శంఖవరం మండలంలో వరుపులతో అనంతబాబు (ఫైల్‌ఫొటో)

అందుకేనా ప్రత్యేక దృష్టి...

ప్రత్తిపాడు రాష్ట్రంలో అత్యధిక మైనింగ్ నిల్వలున్న నియోజకవర్గం. ఇక్కడ రౌతులపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని కొండల్లో భారీ లేటరైట్ నిల్వలున్నాయి. ఇదికాకుండా భవనాలు, రహదారుల నిర్మాణానికి వాడే నల్లరాయి, ఇతర మెటల్స్ గ్రావెల్ కొండలు వేలల్లో ఉన్నాయి. రాష్ట్రంలో అనేకచోట్లకు బ్లాక్‌మెటల్స్, నల్లరాయి, బండరాళ్లు, ఇతర గ్రావెల్ ఇక్కడి నుంచే వెళ్తాయి. ఈ నేపథ్యంలో కోట్ల టర్నోవర్ ఉన్న మైనింగ్‌పై కన్నేసిన అనంతబాబు భవిష్యత్తులో ఇక్కడ పార్టీ గెలిస్తే మొత్తం తన కనుసన్నల్లోనే నడిపించొచ్చనే ముందస్తు వ్యూహంతో పావులు కదుపుతున్నట్టు పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. రంపచోడవరాన్ని అనుకుని ఉన్న ప్రత్తిపాడులో కూడా పాగ వేస్తే ఇక ఎదురుండదనే ఆలోచనతో జోక్యం చేసుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. మరో పక్క ఈ స్కెచ్ వెనుక కాకినాడ సిటీ వైసీపీ కీలక నేత అండదండలున్నాయని సమాచారం. హత్య కేసులో అనంతబాబు ఇరుక్కున్న తర్వాత అరెస్ట్ జరగకుండా సదరు కీలక నేతే పావులు కదిపారు. కేసు నమోదవకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఈ ఇద్దరు నేతలు కలిసి ముందస్తు వ్యూహంలో భాగంగానే ప్రత్తిపాడుపై కన్నేసినట్టు పార్టీలో తాజా చర్చ జరుగుతోంది.





సూర్యప్రభ వాహనంపై ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు.. రథాన్ని రాజావారి వీధికి లాగుతున్న భక్తులు

నరసన్న పెండ్లి కొడుకాయెనే..

- వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారికి వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు, సేవా కమిటీ సభ్యులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేశారు. అనంతరం స్వామివారి నూతన రథానికి పూజలు నిర్వహించారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆదిదేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా తీర్చిదిద్దారు. స్వామివారు ఉదయం సూర్య వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. - 7లో

రత్నగిరిపై రథసప్తమి వేడుకలు



ఆవుపాలతో పాయసం వండుతున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పంచాయతనాల్లో ఒకరైన సూర్యభగవానుడికి ముందుగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్షిక కల్యాణ వేదికపై రుత్విక్‌లు సూర్యనమస్కారములు, సూర్యభగవానుడికి అష్టోత్తర శతనామ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు ఆవుపిడకల మంటపై క్షీరాన్నం వండి స్వామికి నివేదించి భక్తులకు తీర్థప్రసాదాలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిని విడుదల చేసి పంటలు కాపాడాలంటూ ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, రైతులు

సాగునీటిని విడుదల చేయాలంటూ టీడీపీ ధర్నా

పంటలు కాపాడాలంటూ పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండు

పిఠాపురం, ఫిబ్రవరి 16: ఏలేరు రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేసి పంటలు కాపాడాలంటూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల మీదుగా ప్రదర్శనగా నాయకులు, కార్యకర్తలు, రైతులు తహశీల్దారు కార్యాలయం వరకూ తరలివచ్చారు. సామర్లకోట రోడ్డుపై కొంతసేపు రాస్తారోకో జరిపారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో దాళ్వాకు సాగునీరు అందిస్తామని చెప్పి వరిసాగు చేసిన తర్వాత నీరు ఇవ్వకపోవడంతో పంట ఎండిపోతోందన్నారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు, తిమ్మాపురం, వెల్దుర్తి, రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, గొల్లప్రోలు పట్టణం, మండలంలోని ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, లక్ష్మీపురం, సీతానగరం తదితర గ్రామాలు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని 8 వేల ఎకరాల్లో వరి పొలాలకు నీరందక బీటలు వారుతున్నాయని వివరించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని లేకుంటే ఎకరానికి రూ.30 వేల వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కలెక్టరు తక్షణం స్పందించి సాగునీటి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణచౌదరి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు, ఎలుబండి రాజారావు, నల్లా శ్రీను, కొరుప్రోలు శ్రీను, కోళ్ల బంగారుబాబు, గాది రాజబాబు, సకుమళ్ల నాగబాబు పాల్గొన్నారు.



కాకినాడలో బంద్‌లో భాగంగా ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16: సంయుక్త కిసాన్‌లోని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల సంఘాలు సంయుక్తంగా తలపెట్టిన దేశవ్యాప్తబంద్‌లో భాగంగా కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతృత్వంలో శుక్రవారం కాకినాడ పరిసర ప్రాంతాల్లో గ్రామీణబంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. ఉదయం నుంచి కాకినాడ సీపోర్ట్ వద్ద పారిశ్రామిక సమ్మె చేపట్టారు. పలు పరిశ్రమల నుంచి కార్మికులను బయటకు పంపించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, సీఐటీయూ రూరల్ కన్వీనర్ టి.రాజా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఏఐసీసీటీయూ జిల్లా కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబిబాబు మాట్లాడారు. రైతు వ్యతిరేక బిల్లులు తేవడం, కార్మిక చట్టాలను రద్దు చేయడం, హిట్ అండ్ రన్ చట్టం చేయడం వంటి మోడీ విధానాలతో రైతులు, కార్మికులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఆటో యూనియన్ నాయకుడు వర్మ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, పలు సంఘాల నాయకులు బోడకొండ, చింతపల్లి అజయ్‌కుమార్, మేడిశెట్టి వెంకటరమణ, వల్లూరి సత్తిబాబు, భారతి, జ్యోతి పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాతో తప్పులు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

'ఓటమి భయంతో ద్వారంపూడి దొంగ ఓట్లు'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16 : వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతతో ఓటమి భయం పట్టుకుని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి భారీగా దొంగ ఓట్లు చేర్పించాడని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌లకు ఆధారాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సిటీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేర్చి ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. దొంగ ఓట్లు చేర్పులు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపుపై గత ఆరు నెలలుగా జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. నగరంలో జీరో డోర్ నంబర్‌తో ఓట్లు నమోదు చేయడమేకాకుండా, ఒకే కుటుంబంలోని ఓట్లను వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు జంబ్లింగ్ చేశారన్నారు. దీనివల్ల అసలైన ఓటర్ తన ఓటు వేయడానికి ఏ పోలింగ్ కేంద్రానికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఓ అధికారి దగ్గరుండి బీఎల్‌వో లాగిన్ ద్వారా ఇటువంటి చర్యలకు పాల్పడడం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుమ్మళ్ల చిన్న పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఎన్నికలను ప్రణాళికాయుతంగా నిర్వహించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 16: రానున్న సాధారణ ఎన్నికలను ప్రణాళికాయుతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు-2024 సన్నద్ధత నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఓటర్ జాబితాలోని అంశాలపై నమోదైన ఫారం-6,7,8 దరఖాస్తుల పరిష్కారం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది, శిక్షణ, జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల సీఈవో కలెక్టర్లతో చర్చించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి చర్యలను సీఈవోకు కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో డి.తిప్పే నాయక్, సీపీవో పి.త్రినాథ్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మంచుటెండ!

- భిన్న వాతావరణ పరిస్థితులు
- పగటిపూట భానుడి భగభగలు
- రాత్రి నుంచి ఉదయం వరకూ వీడని చలి, పొగమంచు
- తాజా మార్పులతో జిల్లావాసులకు తప్పని ఇబ్బందులు
- వృద్ధులు, పిల్లలతోపాటు పలువురికి అనారోగ్య పరిస్థితులు



పెద్దాపురంలో శుక్రవారం ఉదయం కమ్మేసిన పొగమంచు

పెద్దాపురం, ఫిబ్రవరి 16: జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో నెత్తిన సూర్యుడు ఠారెత్తిస్తున్నాడు. రాత్రయితే చలి తీవ్రతకు ప్రజలు గజగజలాడుతున్నారు. గడచిన వారంరోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్నారులు వణుకుతున్నారు. ముఖ్యంగా మంచు అధికంగా ఉంటుండడంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. అంతకుముందు తుపాన్ల కారణంగా వర్షాలు, ఉదయం ఎండల తీవ్రత, తెల్లవారుజామున మంచు ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గడచిన వారం రోజులుగా మళ్లీ చలి తీవ్రత పెరిగిపోవడంతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో శీతల గాలుల తీవ్రతతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఫలితంగా చలి విజృంభిస్తోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి దట్టమైన చలిగాలులతో పరిస్థితి ఒక్కసారిగా భిన్నంగా మారిపోయింది. ఉదయం బయటకు వెళ్లాలంటే స్వెట్టర్లు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయాల్లో ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నాయి. అంతేకాకుండా తెల్లవారుజామున పొగ మంచు కమ్మేస్తోంది. ఈ సమయంలో రహదార్లపై ప్రయాణం చేయాలంటే కత్తిమీద సాములాగే ఉంటోంది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల వరకూ చలిగాలులు వీస్తుండడంతో చలికి వణికిపోవాల్సి వస్తోంది. తిరిగి రాత్రి సమయాల్లో ఇదే పరిస్థితి పునరావృత్తం అవుతోంది. సాయంత్రం ఐదు గంటలు దాటితే చలి వణికిస్తోంది. ఈ ఏడాది వేసవిలో మొదట ఓ మోస్తరు వేడి మొదలై ఆ తరువాత క్రమేపీ తీవ్రమైన వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. సముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్న కారణంగా ఆ ప్రభావంతో ఎండలు ఎక్కువగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి నెలలోనే ఉదయం సమయాల్లో సూర్యుడు ఠారెత్తించే పరిస్థితులు నెలకొనడంతో ముందుముందు పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. గాలిలో తేమశాతం పెరగడంతో ఉదయం వేళల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదయం రహదారులను మంచుతెరలు కమ్మేస్తున్నాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం

- వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు
- రథసప్తమి పర్వదినాన సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం
- అడుగడుగునా భక్తుల నీరాజనాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాగతం



ముద్రికాలంకరణ చేస్తున్న పండితులు

ఆర్తజన రక్షకుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి రోజున వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైఖానస ఆగమానుసారం, వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. తిరువారాధన, బాలభోగం, పంచామృత అభిషేకాలు జరిగాయి. బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు.



చంద్రప్రభ వాహనంపై స్వామివారు



రథాన్ని లాగుతున్న భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 16:

కల్యాణోత్సవాలకు శ్రీకారం

శ్రీకర, శుభకర, ప్రణవ స్వరూపుడైన ఆది దేవుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను తీర్చిదిద్దే అపూర్వ ఘట్టానికి శుక్రవారం అంతర్వేది ఆలయం వేదికైంది. ఆచారం ప్రకారం కేశవదాసుపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాల సంయుక్త నిర్వహణలో సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ముద్రికాలంకరణ నిర్వహించారు. విశేష పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను అర్చకులు పెళ్లికి సిద్ధం చేశారు. అర్చకులు వేదమంత్రోచ్చారణలతో నీల మేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు వార్షిక ఉంగరాలను సమర్పించారు. రెండు కుటుంబాల ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ, ముప్పర్తి కుటుంబ సభ్యులు, కొపనాతి కృష్ణమ్మ కుటుంబ సభ్యులు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి, కేఎస్ఎన్ రాజు, వలవల రాంబాబు, సర్పంచ్ కొండా జాన్ బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వాహనకారులు తదితరులు పాల్గొన్నారు.

తొలిపూజ

ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి ఆలయ చైర్మన్, అధికారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, అగ్నికుల క్షత్రియులు పూల మాలలు వేశారు. అనంతరం శ్రీ స్వామివారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనచోదకులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజావారి వీధి)కి చేర్చారు.

సూర్య'ప్రభ'

తొలిరోజు శ్రీలక్ష్మీనరసింహుడు శృంగవరప్పాడు వాస్తవ్యులు అడబాల వెంకన్న కుమారులచే నిర్మితమైన సూర్యవాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి వారు హారతులు ఇచ్చారు. రథ సప్తమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళా భక్తులు సూర్య నమస్కారాలు చేశారు.

చంద్ర'ప్రభ'

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి, మోరిపోడు వాస్తవ్యులు ముప్పర్తి సుబ్బారావు కుటుంబ సభ్యులచే నిర్మితమైన చంద్రప్రభ వాహనంపై రాత్రి 8 గంటలకు స్వామివారు నృసింహ నామచరణాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీప కాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగారు. స్వామివారికి భక్తులు హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

నేడు గరుడ పుష్పక వాహనంపై

శనివారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం. నిత్యం స్వామివారిని సేవిస్తారు. భక్తుల మనోరథం నెరవేర్చడం కోసం శ్రీస్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తారు. దీనిని చాటిచెప్పేందుకే స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. రాత్రి 7 గంటలకు వాహన సేవ జరుగుతుంది.



కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు కదిలిస్తున్న చైర్మన్, ఆలయ అధికారులు, వాహనకారులు

11 రోజుల పాటు మహాకుంభాభిషేకం

జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఘనంగా ఏర్పాట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జ్యోతుల నెహ్రూ,నవీన్ తదితరులు

జగ్గంపేట, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికాసమేత మల్లికార్జున స్వామి దేవస్థానం నందు కోటి శివలింగాలతో నిర్వహించనున్న మహా కుంభాభిషేకానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇర్రిపాక శివాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేక సమిత రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. శృంగేరీ పీఠాధిపతి ఆశీస్సులతో ఈ నెల 26 నుంచి మార్చి 7 వరకు 11 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యావన్మంది భక్తులు పాల్గొని పరమశివుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులందరూ ఈ కోటి పార్థివ శివలింగాలను తమ స్వహస్తాలతో అభిషేకించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, మంగ రైతు రామకృష్ణ, కందుల చిట్టిబాబు, తోటరవి, తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కన్నబాబు, జాస్తి వసంత్, నీలం శ్రీను, ఉంగరాల రాము, పాఠంశెట్టి మురళీకృష్ణ, పైడిపాల సూరిబాబు, కందుల బాబ్జి, తూము కుమార్, అడబాల భాస్కరరావు, బదిరెడ్డి అచ్చన్నదొర పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి వెండి ఆభరణాలు



ఆభరణాల బహూకరణ

పిఠాపురం, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న రాజరాజేశ్వరీదేవికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలకు చెందిన డాక్టర్ కంచి చంద్రయ్య, డాక్టర్ నందినిరాణి దంపతులు సుమారు 6.50 లక్షలు విలువైన ఎనిమిదిన్నర కిలోల వెండితో వెండి చీర, వక్షస్థలం, కిరీటం, హస్తాలు, గణపతి సుబ్రహ్మణేశ్వరుడు, పీఠం తయారు చేయించారు. వాటిని శుక్రవారం అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు వాటిని అమ్మవారి ముందుంచి పూజలు నిర్వహించారు. దాతలను ఆలయ అధికారులు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, ఏసీ పులి నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌కు ఈట్‌రైట్ స్టేషన్‌గా గుర్తింపు



అన్నవరం, ఫిబ్రవరి 16: ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులకు అందుబాటులో సేవలందిస్తున్న అన్నవరం రైల్వేస్టేషన్‌కు ఫుడ్‌సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈట్‌రైట్ సర్టిఫికెట్‌ను అందించినట్టు అన్నవరం రైల్వేస్టేషన్ మాస్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. విజయవాడ డివిజన్‌లో ఈ హోదా పొందిన స్టేషన్ అన్నవరం రైల్వేస్టేషన్ కావడం విశేషమని అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో నాంపల్లి (హైద్రాబాద్) తర్వాత ఈ జోన్‌లో రెండో స్టేషన్‌గా గుర్తింపు పొందింది. స్టేషన్‌లో ఉన్న క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత, విక్రేత వ్యక్తిగత శుభ్రత, ఫుడ్ గడువు తేదీల వ్యర్థాల తొలగింపు తదితర వాటిని పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు పత్రం జారీ చేస్తారని సతీష్‌కుమార్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మైనర్‌తో సహా ముగ్గురి అరెస్టు

అనపర్తి, ఫిబ్రవరి 16 : గంజాయి పీల్చేందుకు ప్రత్యేకంగా గదిని అద్దెకు తీసుకుని గంజాయి మత్తులో జోగుతున్న బాలుడితో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. మరో ఇద్దరు యువకులు పరారైనట్లు ఎస్‌ఐ తెలి పారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తిలోని పద్మశ్రీ థియేటర్ సమీపంలో పెంకుటిల్లును అద్దెకు తీసుకున్న కొందరు యువకులు గంజాయి మత్తులో జోగుతున్నట్లు వచ్చిన సమాచారంతో సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గదిలో గంజాయి మత్తులో జోగుతున్న మైనర్ బాలుడి సహా కర్రి అజయ్ గోపాల కృష్ణారెడ్డి, దుప్పలపూడికి చెందిన తాతపూడి దివాకర్‌లు పట్టుబడగా దుప్పలపూడి గ్రామానికి వరపు సాయి, అనపర్తికి చెందిన పిల్లి కార్తీక్ పరారైనట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 1కిలో 127 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని గంజాయి సరఫరా చేసిన వారి వివరాలను సేకరించే పనిలో పడ్డామని అన్నారు. అనపర్తి, దుప్పలపూడి గ్రామాల్లో గంజాయి సేవించే యువత పెరిగినట్లు గుర్తించామని ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. పట్టుబడ్డ నిందితులను కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సత్యదేవుడిని దర్శించుకున్న నటి హేమ



సత్యదేవుడిని దర్శించుకున్న హేమ

అన్నవరం, ఫిబ్రవరి 16: సత్యదేవుడి సన్నిధిలో సినీనటి హేమ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా ఆమెతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు, ఉద్యోగులు ఆసక్తి కనబర్చారు.

నకిలీ నోట్లతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు



నిందితులతో పోలీసులు



నకిలీనోట్లు, కెమికల్ బాటిల్స్

అన్నవరం, ఫిబ్రవరి 16: నకిలీ నోట్లతో ఒకరిని మోసం చేసిన వ్యక్తులను అన్నవరం పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురానికి చెందిన అనుసూరి రాజబాబు వద్ద ఒక స్థలం అమ్ముతానని అదే గ్రామానికి చెందిన ఈటి జగదీష్ రూ.20 లక్షలు తీసుకున్నాడు. అయితే స్థలం విక్రయించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడంతో తీవ్ర ఒత్తిడి చేశారు. అయితే తన వద్ద డబ్బులు లేవని బ్లాక్‌మనీ ఉందని దానిపై కెమికల్స్ పూస్తే అసలైన నోట్లగా మారతాయని పేర్కొంటూ కొన్ని అసలు నోట్లపై నలుపు రంగు పూసి తర్వాత కెమికల్‌తో కడగడంతో అవి అసలు కరెన్సీగా కనిపించడంతో నమ్మి 5 నోట్లకట్టలు తీసుకున్నారు. తర్వాత మోసపోయినట్లు గ్రహించిన రాజబాబు మిగిలిన మొత్తంపై మరోసారి ఒత్తిడి చేయడంతో శుక్రవారం అన్నవరం వస్తే మిగిలిన నోట్లకట్టలు ఇస్తానని జగదీష్ తెలిపారు. దీంతో రాజబాబు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ప్రత్తిపాడు ఇన్‌చార్జి సీఐ ఎస్.లక్ష్మణరావు, అన్నవరం ఎస్‌ఐ కిశోర్ సిబ్బందితో జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపంలో వలపన్ని జగదీష్‌తో పాటు మరో ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 15 నోట్ల కట్టలు, కెమికల్ బాటిల్స్, వారు వచ్చిన ఆటోను స్వాధీనం చేసుకుని ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని ఎస్‌ఐ కిశోర్ తెలిపారు.

వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న గన్ని భాస్కరరావు తదితరులు

రాజానగరం, ఫిబ్రవరి 16: వైద్య రంగంలో సాంకేతిక నైపుణ్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్ర మెడికల్ టెక్ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్ర శర్మ అన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 16వ స్నాతకోత్సవం శుక్రవారం సాయంత్రం కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జితేంద్రశర్మ మాట్లాడుతూ ఒక నియమంగా పెట్టుకుని 100 మంది చొప్పున ఉచిత వైద్యం చేయాలని యువ డాక్టర్లకు ఆయన సూచించారు. శ్రీలంకలోని పెరడేనియా యూనివర్సిటీలో డెంటల్ విభాగం ప్రొఫెసర్లు జయసింహే, అట్టిగళ మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు ప్రపంచ దేశాల మధ్య ప్రస్తుతం హద్దులు లేవన్నారు. దీనిలో భాగంగా 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లకు ఈ కార్యక్రమంలో డిగ్రీలు ప్రదానం చేశారు. కళాశాల అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు గ్రాడ్యుయేట్లతో మెడికల్ ఎథిక్స్‌పై ప్రమాణం చేయించారు. అనంతరం ముఖ్య అతిథి జితేంద్ర శర్మను జీఎస్ఎల్ వైద్య సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

98 శాతం ఉత్తీర్ణత...

జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 2018 బ్యాచ్ ఎంబీబీఎస్ పార్ట్‌వన్‌లో 143 మందికి 140 మంది (98) శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ తెలిపారు. 95 మంది 60శాతం కంటే ఎక్కువ, 25 మంది 75శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 600లకు 595 మార్కులతో మేరీ శ్రీకళ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే బ్యాచ్ పార్ట్-2లో 145 మందికి 139 మంది అనగా 95.86 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 76 మంది ఎక్కువ మార్కులతో ఫస్ట్‌క్లాస్ సాధించారన్నారు. 25 మంది 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. 600లకి 598 మార్కులతో కాంద్రేగుల వసంతలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ సంస్థల చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మెడికల్ కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. .

4వ ఖేలో ఇండియా సమన్వయకర్తగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే,ఫిబ్రవరి 16: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో అసోంలోని గువహటిలో ఈనెల 17 నుంచి 22వరకూ జరిగే 4వ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ కబడ్డీ పోటీలకు సమన్వయకర్తగా డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ న్యూఢిల్లీలోని ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పీఆర్వో, డీపీఏ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు శ్యామ్‌కుమార్‌ను అభినందించిన అనంతరం మాట్లాడుతూ గత ఏడాది 3వ ఖేలో ఇండియా గేమ్స్‌కు సమన్వయకర్తగా శ్యామ్ కుమార్ వ్యవహరించారన్నారు. ఖేలో ఇండియా సౌత్‌జోన్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్‌ను రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, సీఈ శ్రీనివాసులు, మాలోతు రమేష్ అభినందించారు.



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నాటిక పోటీలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీలను నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, తాటిపర్తి సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వచ్చిన కళాకారులు మూడు రోజులు పాటు పలు నాటికలను ప్రదర్శించనున్నారు.

నూతన రథానికి పూజలు



అన్నవరం, ఫిబ్రవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి కొండపై వివిధ పర్వదినాల్లో సేవలందించేందుకు నూతనంగా తయారుచేయించిన టేకు రథానికి శుక్రవారం ఉదయం పండితులు కొండదిగువ పంపా సత్రం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో రామచంద్రమోహన్ రథాన్ని ప్రారంభించారు. అయితే రథాన్ని కొండపైకి తీసుకెళ్లే సమయంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద బోల్టులు తగులుకుని ఊడిపోవడంతో కొద్దిసేపు రథాన్ని నిలిపివేసి మరమ్మతులు చేయించిన అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. అయితే ఈ ఆలస్యం కారణంగా శుభఘడియలు ముగియడంతో రథోత్సవం వాయిదా వేశారు. త్వరలో మరో మంచి ముహూర్తంలో రథోత్సవం చేపట్టనున్నట్లు పండితులు పేర్కొన్నారు.

పిల్లలతో పని చేయించారు



అనపర్తి, ఫిబ్రవరి 16: అనపర్తిలోని ద్వారంపూడి బుల్లెమ్మాయి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం కూలీలుగా మారిపోయారు. పాఠశాలలో పలుగు, పారలు పట్టుకుని మట్టి తవ్వి మోస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చదువుకోవాల్సిన విద్యార్థులకు ఇలా పని చెప్పడాన్ని పలువురు తప్పుబట్టారు.

కోవిడ్ సాయం స్వాహాపై ఏసీబీ విచారణ

కాట్రేనికోన, ఫిబ్రవరి 16: కొవిడ్ డెత్ ఎక్స్‌గ్రేషియా పంపిణీలో అవకతవకలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఇందులో అనేక వాస్తవాలు, అక్రమాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన కొంకి సింహాద్రి 2021 మే 22న కొవిడ్‌తో కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. అతడి భార్య మంగాదేవి కొవిడ్ ఆర్థిక సహాయం కోసం అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసినా సొమ్ములు అందలేదు. చివరకు విసిగి వేసారిన మంగాదేవి సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకుంది. దీంతో అసలు విషయం బయట పడింది. కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం రికార్డుల ప్రకారం ఏడాది క్రితమే రూ.50వేలు ఎస్‌బీఐ ఖాతాకు జమ చేసినట్టు, కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ సెక్షన్లో సంప్రదించాలని సమాచారం అందించారు. అయితే ఆ బ్యాంకు ఖాతా బినామీదిగా తేలింది. ఆ ఖాతా తనది కాదని, సొమ్మును కావాలని వేరే జిల్లాకు చెందినవారి బ్యాంకు ఖాతాకు బదలాయించారని బాధితురాలు మంగాదేవి లబోదిబోమంటోంది. ఈ వ్యవహారంపై ఆమె కాకినాడ డీఆర్వోతో పాటు హెచ్ సెక్షన్ సిబ్బందిని ఎన్నిసార్లు కలిసినా సరైన సమాధానం రాలేదు. సిబ్బంది చేతివాటంతో కలెక్టర్ కార్యాలయంలో కొవిడ్ ఫైలు మాయమైనట్టు తెలిసింది. దాంతో అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోలేక, తనకు ఆర్థిక సాయం అందించలేక విచారణ పేరుతో వాస్తవాన్ని దాచిపెడుతూ కాలయాపన చేస్తున్నారని ఆమె వాపోయింది. తాజాగా మంగాదేవి సమాచారహక్కు చట్టం ద్వారా మరోసారి కలెక్టర్ కార్యాలయానికి లేఖ రాసింది. అసలు విషయం బయటపడడంతో కలెక్టర్ కృతికా శుక్లా కోనసీమ జిల్లా కలెక్టర్ ద్వారా కాట్రేనికోన తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఇదే సమయంలో మంగాదేవి తన సొమ్ము కాజేశారని ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసీబీ రాజమహేంద్రవరం డీఎస్పీ విచారణకు ఆదేశించడంతో సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఏసీబీ సిబ్బంది ఇటీవల నడవపల్లిలోని మంగాదేవి ఇంటికి వెళ్లి విచారించింది.



రాజమౌళిని కలిసిన మార్గాని

కడియం, ఫిబ్రవరి 16: ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళిని శుక్రవారం కడియపులంక వీర హనుమాన్ నర్సరీ రైతు, రాష్ట్ర టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ కలిశారు. యుఆర్ హోం మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాజమౌళి దంపతులతో కొద్దిసేపు మాట్లాడి మాల్ అధినేత గోపాలకృష్ణతో కలిసి ఆంథోరియం రెడ్ మొక్కను అందజేశారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన కడియం నర్సరీల సందర్శనకు కుటుంబ సభ్యులతో కలిసి వస్తానని రాజమౌళి ఈ సందర్భంగా వారికి తెలిపారు.

లింక్ పంపించి రూ.4 లక్షలకు బురిడీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లింక్ దోపిడీ కేటుగాళ్ల వలలో పడి ఓ గృహిణి మోసపోయారు. ఆమె త్రీటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివాసం ఉండే గెడ్డం దివ్య సురేఖకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. గవర్నమెంట్ ప్లాట్‌ఫాంతో వర్క్‌ఫ్రం హోం ఇస్తామని, ఇంటి దగ్గర నుంచే డబ్బులు సంపాదించుకోవచ్చని ఆ మెసేజ్ సారాంశం. దీంతో ఆ మెసేజ్‌కి సురేఖ జవాబు పంపారు. వాట్సాప్ ద్వారా అవతలి వాళ్లు ఈమెతో మాట్లాడి టెలిగ్రాంలో ఒక లింక్ పంపించారు. దానిలో ఉన్న వర్క్ చేసి బాధితురాలు వాళ్లకు పంపించారు. డబ్బులు చెల్లిస్తే ఇంకొంత వర్క్ ఇస్తామని మళ్లీ మెసేజ్ పెట్టారు. ఈ క్రమంలో సురేఖ దఫదఫాలుగా రూ.4,08,000 సదరు సైబర్ నేరగాళ్లకు పంపించారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వాలంటే రూ.5లక్షలు చెల్లించాలని నేరగాళ్లు అంటున్నారని సురేఖ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. లింక్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అపరిచితులు పంపించే లింక్‌లను క్లిక్ చేయవద్దని.. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

కాకినాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఫిబ్రవరి 16: సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీఏ విద్యుత్ ఫీడర్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏవీఎస్డీఎస్.ప్రభాకర్ తెలిపారు. సామర్లకోటతో పాటు మండలంలోని నవర, పవర, గొంచాల, ఉండూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్ వెన్నులో వణుకు

ప్రభుత్వంపై టీడీపీ నేతల ఆగ్రహం

జగ్గంపేట, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్ రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందని, ఒక్క సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలి సారని, రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమాను అడ్డుకునే నీచస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ విమర్శించారు. ఇర్రిపాక శివాలయం వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌కు వచ్చిన నష్టం ఏమిటని ఎద్దేవా చేశారు. ఈ సినిమా ద్వారా ప్రజల్లో మరింత వ్యతిరేకత వస్తుందనే భయంతో వైసీపీ ప్రభుత్వం కోర్టుకు వెళ్లిందన్నారు. సైకో సీఎం అమరావతి రైతుల ఉసురు పోసుకున్నాడని, రాష్ట్రం కోసం ప్రజల కోసం తీసిన సినిమాను సీఎం అడ్డుకోవడం దారుణమన్నారు. మూడు రాజధానుల పేరుతో ఏపీని నిలువుదోపిడీ చేసింది జగన్ అండ్ కో అని ఆరోపించారు.

కాకినాడ సిటీ: రాజధాని విషయంలో జగన్‌రెడ్డి చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసంపై కళ్లకు కట్టినట్లు చూపించిన రాజధాని ఫైల్స్ సినిమాపై ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్ధలయ్యాయని కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒక పాలకుడి కుట్రలతో ప్రజా రాజధాని ఎలా విధ్వంసం అయ్యిందో ఈ సినిమాలో చూపించారన్నారు. ప్రభుత్వం టెర్రరిజంతో చేసిన విధ్వంసం ఈ సినిమా ద్వారా ప్రజలకు తెలుస్తుందన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా సినిమా ప్రదర్శనకు కోర్టు అనుమతించడం మంచి పరిణామమన్నారు.

తుని రూరల్: సామాజిక బాధ్యతతో రాజధాని ఫైల్స్ సినిమా తీస్తే ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఎందుకు అంత ఉలిక్కిపాటు అని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య ఒక లేఖ ద్వారా ప్రశ్నించారు. ఈ సినిమా జగన్ రెడ్డి వెన్నులో వణుకు పుట్టిస్తుందని, అందుకే సినిమాను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ సినిమాతో జగన్‌రెడ్డిపై వ్యతిరేకత మరింత ఎక్కువైందని 34వేల మంది రైతుల త్యాగాలు, శాపాలుగా మారి జగన్ పతనానికి కారణమవుతాయన్నారు.

సర్పవరం జంక్షన్: రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చిన రైతు కుటుంబాలకు జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయాలను రాజధాని ఫైల్స్ సినిమాలో ఉండడంతో వణుకు ప్రారంభమైందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా అన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా విడుదల అయితే వైసీపీ అడ్రసు గల్లంతు అవుతుందనే భయంతో సినిమా ఆపేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన 34 వేల మంది రైతు కుటుంబాలకు జరిగిన అన్యాయం బయటకు తెలియకూడదనే జగన్ ఈ సినిమా విడుదలకు కుట్రలు చేస్తున్నారన్నారు.

'వ్యాధిగ్రస్తులు లేని సమాజ నిర్మాణానికి కృషి'

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 16: వ్యాధిగ్రస్తులు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని.. హెచ్ఐవీ, ఎయిడ్స్ తదితర వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ తెలిపారు. శుక్రవారం కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణలో భాగంగా కళాజాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణలో భాగంగా వీధి నాటకాల ద్వారా ప్రజల్లో కళాజాత ద్వారా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కళాజాత ఈనెల 16 నుంచి 27వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి, డీఐవో డాక్టర్ రత్నకుమార్, డీపీఎం జిఆదిలింగం తదితరులు ఉన్నారు.

'బకాయిలు విడుదల చేయాలి'

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 16: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీ 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీ జేఏసీ ఉమ్మడి జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ఏపీజేఏసీ పిలుపు మేరకు శుక్రవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద భోజన విరామంలో ఆందోళన చేపట్టారు. చైర్మన్ గుద్దటి రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఎల్, జీపీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ, డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ట్రెజరీ సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాస్, జడ్పీ నుంచి ఆర్‌వీ రమేష్, ఎస్టీయూ, యుటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘాల ప్రతినిధులు ఎం శ్రీనివాస్, కె నగేష్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే ప్రయత్నాన్ని విరమించుకోవాలి'

తాళ్లరేవు, ఫిబ్రవరి 16: చొల్లంగి సర్వేనెం.47/3, 4.24సెంట్లు భూమిలో కరప మండలం ఉప్పలంక గ్రామస్తులకు పట్టాలిచ్చామని లబ్ధిదారులను రెచ్చగొట్టే ప్రయత్నాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విరమించుకోవాలని తాళ్లరేవు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం చొల్లంగి దీక్షా శిబిరం వద బీఎస్ఆర్మీ పార్టీ నేతలు పిల్లి శివకుమార్, పెట్టా విజయకుమార్, ఎద్దు సాయి, పోల్నాటి రాజు నిరసనకారులకు సంపూర్ణ మద్దతును తెలిపారు. గర్రే లక్ష్మీనారాయణ, మేడపాటి దేవా, పులపకూర చినబాబు, కనకాల పెదబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

రెండో రోజుకు మత్స్యకారుల దీక్ష

తొండంగి, ఫిబ్రవరి 16: కాలుష్యకారక పరిశ్రమల కారణంగా ఉపాధి కోల్పోతున్న తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఒంటిమామిడిలో మత్స్యకారులు చేస్తున్న దీక్ష రెండోరోజుకు చేరింది. శుక్రవారం తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ శిబిరాన్ని సందర్శించి మత్స్యకారులను పరామర్శించారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను టీడీపీ అధినేత చంద్రబాబు, యనమల రామకృష్ణుడుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. టీడీపీ జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకట రమణ, పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, చొక్కా కాశీశ్వరరావు, సూరాడ రాంబాబు, ముత్తి మహేష్, కోడ అప్పలరాజు, చొక్కా మహంకాళి, సత్యన్నారాయణ, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్ భవన నిర్మాణం

తాళ్లరేవు, ఫిబ్రవరి 16: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఉప్పంగల గ్రామంలో ఆగమేగాల మీద ఎన్నికల పోలింగ్ బూత్ భవన నిర్మాణాన్ని సర్వశిక్షాభియాన్ ఇంజనీర్ పర్యవేక్షణలో స్థానిక సర్పంచ్ చేపట్టారు. ఈప్రాంతంలో గతంలో మండల ప్రాథమి పాఠశాల భవనం ఉండగా ఇందులో పోలింగ్‌బూత్‌కేంద్రం నెం.246, అంగన్‌వాడీ సెంటర్లు నడిచేవి. స్కూల్లో హాజరుశాతం లేకపోవడంతో పాఠశాలలను వీలీనం చేసే క్రమంలో ఇక్కడ పాఠశాల పోయింది. స్థానికులు సచివాలయం కడదామని స్కూల్ భవనాన్ని తొలగించారు. హైకోర్టు ఆదేశాలతో ఏ భవన నిర్మాణం జరగలేదు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల పరిశీలనలో విషయం బయటపడింది. భవనం కూల్చివేసినా పోలింగ్ కేంద్రం మాత్రమే ఇక్కడే ఉన్నట్టు చూపించడంతో భవన నిర్మాణం అనివార్యమైంది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సర్వశిక్షాభియాన్ నిధులు రూ.12లక్షల అంచనాలతో పోలింగ్‌బూత్ కేంద్రభవన నిర్మాణాన్ని చేపట్టారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రౌతులపూడి, ఫిబ్రవరి 16: రౌతులపూడిలో శెట్టిబలిజపేటలో అగ్ని ప్రమాద బాధితులను ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పరామర్శించి నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందించారు. రౌతులపూడికి చెందిన అడ్వకేట్ గంటా శ్రీలక్ష్మి బాధితులకు రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, సర్పంచ్ నందమూరి రాజా, మాజీ సర్పంచ్ గొల్లు పెద్దదివాణం, పల్లా సూరిబాబు, పల్లికుమార్ పాల్గొన్నారు. బలరామపురంలో పాదాలమ్మ, మరిడమ్మ అమ్మవార్లను వరుపుల సత్యప్రభ దర్శించుకున్నారు.

కార్మిక సంఘాల ధర్నా

పిఠాపురం, ఫిబ్రవరి 16: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తాము పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ రైతులు, రైతు సంఘాలు ధర్నా నిర్వహిస్తుంటే వారి మీద బాష్పవాయువు ప్రయోగించి ముళ్లకంచెలు వేసి అడ్డుకోవడం దారుణమన్నారు. సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఇతర సంఘాల నేతలు కుంచే చిన్నా, కోనేటి రాజు, జి.వీరబాబు, కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు, డి.సత్యనారాయణ ఉన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడమ్‌వెబ్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యుడిఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజ్‌బ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

రాష్ట్రస్థాయికి సైన్స్ నమూనా ఎంపిక

తొండంగి, ఫిబ్రవరి 16: పిఇ.చిన్నయ్యపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని జాగు విజయ దుర్గ రూపొందించిన సైన్స్ నమూనా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు హెచ్ఎమ్ ఎం.వసంత కుమారి తెలిపారు. కాకినాడలో జిల్లాస్థాయిలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.కొండబాబు, ఎంఎస్నార్ మూర్తి, విజయదుర్గ రూపొందించిన బహుళార్థ సాధక వ్యవసాయ పరికరం రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఎంఈవోలు అభినందించారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

» జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు



సర్పవరం జంక్షన్:అచ్చంపేట సెంటర్లో ఆందోళన



జగ్గంపేటలో వివిధ సంఘాల నేతల ర్యాలీ

సర్పవరం జంక్షన్, జనవరి 5: డ్రైవర్ల జీవితానికి ఉరితాడు వేసేలా కేంద్రం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాల్సిందేనని, లేదంటే దేశవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధం చేస్తామని జయహో రథసారధి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యేలేటి వాసు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా శుక్రవారం తిమ్మాపురం అచ్చంపేట సెంటర్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో వాహనాలను నిలుపుదల చేసి రాస్తారోకో, బంద్ నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ఎంవీఐ నూతన చట్టప్రకారం ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగి మరణిస్తే డ్రైవర్లకు 7 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడేలా ఈ చట్టంలో ఉందన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి దేశ ఆర్థికాభివృద్ధి, రవాణా రంగంలో కీలకపాత్ర పోషించే డ్రైవర్లు, వర్కర్లపై కేంద్రం 1062 చీకటి చట్టాన్ని ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బంద్ కారణంగా తిమ్మాపురం-ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీ రవీంద్రబాబు సిబ్బందితో ఆందోళనకారులతో చర్చించి, వాహనాల రాకపోకలకు అంతరాయకం కలిగించవద్దని వారించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు ఉపాధ్యక్షులు రంగారావు, ఆర్టీసీ శ్రీను, మోసే, జయబాబు, సతీష్, తరుణ్, రాజు, పెద్ద ఎత్తున డ్రైవర్లు ఉన్నారు.

పిఠాపురం: కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా పిఠాపురం లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్డులో ఆందోళన నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బాబూజీ, పిఠాపురం శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సత్తిబాబు, పి.కుమార్‌బాబు,ఎం.రమణ, కె.నూకరాజు, సీఐటీయూ నేత కుంచే చిన్నా పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ, అఖిల భారత రైతుకూలీ సంఘం, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్టాలిన్ భవన్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.ఏసు, అఖిల భారత్ రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కె.లక్ష్మి, ఈ.వెంకటరమణ, వీర్రాజు, శేషగిరిరావు, గంగా జ్యోతి, రాఘవరెడ్డి, అన్నపూర్ణ, సురేష్ ఉన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవులో ప్రజాసంఘాల నాయకులు తహశీల్దార్ కార్యాలయం నుంచి గుడివానితూము వరకు ట్రాక్టర్లు, బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. టేకుమూడి ఈశ్వరరావు, కమిడి సత్యశ్రీనివాస్, మందనక్క తనుకురాజు, దిప్పి అదృష్టదీపుడు ఉన్నారు.

పెద్దాపురం: ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ వర్కర్లు, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో మున్సిపల్ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, ఎస్.శ్రీనివాస్, కృష్ణ, జాలా కామరాజు, సింహచలం ట్రాన్స్‌పోర్టు కార్మికులు పాల్గొన్నారు.

కరప: కరప పోస్టాఫీసు వద్ద కార్మిక, రైతు, ప్రజా సంఘాలు ప్రతినిధులు సీహెచ్‌రమణి, వాసంశెట్టి అప్పారావు, ఎం.ముసలయ్య, ఎస్. గణపతిరావు, తిరుమలరావు, ఆర్.వెంకటలక్ష్మి పలువురు ధర్నా చేశారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప » వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



పెద్దాపురం:టీడీపీలో చేరినవారితో రాజప్ప

పెద్దాపురం, ఫిబ్రవరి 16: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీదే విజయమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక పద్మనాభ కాలనీకి చెందిన సుమారు 20 కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరగా వారికి రాజప్ప టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, కొరిపూరి రాజు తదితరులు ఉన్నారు.

సామర్లకోట: పి.వేమవరంలో టీడీపీ మండలాధ్యక్షులు తోటకూర శ్రీనువాస్, గ్రామ నాయకులు మునిరెడ్డి రాంబాబు, మునిరెడ్డి శ్రీరాములు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప, ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్ హాజరయ్యారు. గ్రామానికి చెందిన నాయకులు కొండపల్లి రామకృష్ణ, తోట వెంకట సూర్యనారాయణ, వినోద్ మరో 50 కుటుంబాలకు చెంది 300 మంది వైసీపీ అనుచరుల పార్టీలోకి చేరగా వారికి టీడీపీ కండువాలను కప్పి స్వాగతించారు. టీడీపీ నాయకులు కుర్రా నారాయణ స్వామి, ధర్మరాజు, చీకట్ల వెంకటేష్, సర్వేశ్వరరావు, అడ్డాల వెంకన్నబాబు, వింటి బాబ్జీ, పాలకుర్తి రవిబాబు, వెన్నా పద్మనాభం, పెంకే వెంకటేష్, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్: జె.కొత్తూరులో వైసీపీ నుంచి భారీగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో అత్తిరెడ్డి శ్రీను, అడపా పల్లంరాజు, దెయ్యాల శ్రీను, తుట్ట రమణ, తుట్ట సత్తియ్య, దెయ్యాల సూరిబాబు, వడ్డాది గోపి, ప్రగడ సతీష్,దువాపు శ్రీను, మాయలేటిశ్రీను, దెయ్యాల దుర్గ,కోరుకొండ త్రిమూర్తులు తదితర 25 కుటుంబాలు వారు ఉన్నారు. జనసేన పార్టీ నాయకులు నకిరెడ్డి రాంబాబు, నకిరెడ్డి వెంకన్న, అడబాల నాగు, నకిరెడ్డి పండు, సిరిమల రాంబాబు మద్దతు తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, చల్లా రామ్మూర్తి ఉన్నారు.

తుని రూరల్: తుని టీడీపీ కార్యాలయంలో కోటనందూరు టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు ఆధ్వర్యంలో కోటనందూరుకి చెందిన వైసీపీ నాయకులు యండ్ర శ్రీను, ధారా వీర సత్తిబాబు, పాలిక ప్రసాద్, పాలిక రాజేష్, శ్యామ్, శ్రీను, తోలం దుర్గ,చింతాకుల హేమంత్, 50 మంది యువత ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, కోటనందూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి లెక్కల భాస్కర్, చింతకాయల రవి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం పేరవరంలో వైసీపీకి చెందిన 100 కుటుంబాలకు టీడీపీలోకి చేరారు. మాజీ ఎంపీటీసీ కర్రి సుబ్బారావు, కర్రి సూర్యప్రకాశరావుల ఆధ్వర్యంలో సంఘన వీరభద్రరావు, మాజీ సర్పంచ్ అబ్బాయి, మాజీ ఎంపీటీసీ సంఘన ప్రభాకరరావు,తూము నాగేశ్వరరావు, ఏలూరి రాంబాబు, వాసంశెట్టి సూరిబాబు, రాయుడు చిన్న, పోలేపల్లి వీరబాబు, నల్లల కృష్ణ, కడారి అచ్చారావు పార్టీలోకి చేరగా టీడీపీ ఇన్‌చార్జ్ సత్యప్రభ ఆహ్వానించారు. పెదశంకర్లపూడిలో మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. సూర్నీడి సురేష్, రాష్ట్ర పెరికి సంఘం నాయకులు వనపర్తి బద్రి, కొమరిశెట్టి నరసింగరావు, సూది బూరయ్య, జ్యోతుల పెదబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పెద్దాపురం భువనేశ్వరీ పీఠంలో సూర్యనమస్కారాలు చేస్తున్న రుత్విక్కులు

పెద్దాపురం, ఫిబ్రవరి 16: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో రథసప్తమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పట్టణ పరిధిలో అమరగిరి (పాండవుల మెట్ట)పై వేంచేసి ఉన్న పంచాయతన నవగ్రహ సహిత పద్మినీ ఛాయా ఉషా ప్రజ్ఞాదేవి సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో పాలపొంగలిని సూర్యనారాయణ స్వామికి నివేదించారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. స్థానిక వర్ధుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరీ పీఠంలో పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో రుత్వికులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అరుణ, తృచ, సౌర, విధమున సూర్య నమస్కార సహిత సౌర హోమాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలో సూర్యనారాయణస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పాలకొల్లు వాస్తవ్యులు గణపతి శర్మ ప్రత్యేక సూర్యయంత్రములతో సౌరము, అరుణ పారాయణ చేసి సూర్యహోమం జరిపించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు లు తదితరులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో సూర్యనారాయణస్వామికి పంచామృత సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. సూర్యనమస్కారాలు చేశారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, దాసం వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో మహిళా భక్తులు సూర్యభగవానుడికి పూజలు చేశారు. స్వామికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆలయ ప్రాంగణంలో ఆవు పిడకల పొయ్యిలపై తయారు చేసి స్వామికి నివేదించారు. పాలపొంగలి, మొలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను స్వామివారికి నైవేద్యంగా గాల్లోకి ఎగరవేశారు. ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జె.భీమశంకరరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రమణయ్యపేట ఏడీబీ రోడ్డులో శ్రీసాయి గోకుల్ గార్డెన్‌లో శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో సూర్యభగవానుడ్ని ప్రార్థిస్తూ సూర్యనమస్కారాలు చేశారు. యోగసభ్యులు అడపావెంకటలక్ష్మి ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో పద్మిని ఉషా ఛాయా సమేత సూర్యభగవానుని స్వామి ఉపాలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు చెరుకూరి రాంబాబు, వేమూరి సోమేశ్వరశర్మ, వినయ్, రాజేష్ స్వామివారిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. అష్టోత్తర శతనామావళి, విశేష పుష్పార్చన పూజలు చేశారు. నంది మండపం వద్ద శాంతికర కల్యాణ పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: రథసప్తమి సందర్భంగా తాళ్లరేవు హైస్కూల్ ఆవరణలో సేవాభారత్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో యానాం ఖండప్రముఖ పివి రామారావు అధ్యక్షతన విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారు. ప్రతిభను కనబరచినవారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఓంప్రకాష్, పితాని శివకృష్ణ, విత్తనాల కరిమిలస్వామి, కొల్లు యువరుద్ర, తారారామ్ పటేల్, పితాని బాలవెంకట రమణ, వాతాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరప: కరప మండల గ్రామాల్లో మహిళలు స్నానమాచరించి సూర్యుడికి పూజలు చేశారు. చిక్కుడు కాయలతో రథం చేసి దారిపై సూర్య భగవానుడిని ఉంచి చిక్కుడు పూలతో అర్చన చేశారు. ఆవుపిడకలపై పాలు పొంగించి క్షీరాన్నం చేసి స్వామి వారికి నైవేద్యం పెట్టారు.

రౌతులపూడి: రౌతులపూడి శివాలయంలో సూర్యనారాయణమూర్తి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పూజారులు పూజలు చేశారు.



ప్రసంగం చేస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

'మౌనం, ధ్యానంతోనే భగవంతుని అనుగ్రహం'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 16: మౌనం, ధ్యానం, ఏకాంతంతోనే భగవంతుని సాక్షాత్కారం, అనుగ్రహం లభిస్తుందని ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ చెప్పారు. మండలంలోని రాచపల్లి అపీత కుంచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామివారిని శుక్రవారం ఆయన దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రసంగం చేశారు. అరుణాచలం మహిమాన్విత క్షేత్రమని, అరుణాచలం జ్యోతిక్షేత్రమని ఈశ్వరుడు స్వయంభుగా అవతరించిన ప్రదేశమని చెప్పారు. రమణాశ్రమ నిర్వాహకులు స్వామి రమణానంద 3రోజుల పాటు స్వామి సామవేదం రాచపల్లిలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేయాలని కోరారు.వారణాసి రవిశర్మ, బొలుసుఅరుణకుమార్ శర్మ, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు శర్మను సన్మానించారు.

'ఎన్నికల కోడ్ వచ్చినా నిర్మాణాలు కొనసాగించవచ్చు'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 16: ఎన్నికల కోడ్ వచ్చినా మొదలుపెట్టిన నిర్మాణాలు కొనసాగించవచ్చని వాటికి బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. హౌసింగ్ డిపార్టుమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయజైన్, ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వెంకటరమణారెడ్డి శుక్రవారం అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిమెంట్, ఇసుక, స్టీల్ కూడా అందుబాటులో ఉండాలని క్షేత్ర స్థాయి అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు గృహ నిర్మాణ దశలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి దశల వారీగా బిల్లులు రికార్డు చేయాలన్నారు. ప్రతీ గురువారం క్రమం తప్పకుండా స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హౌసింగ్ డిపార్టుమెంట్ వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తారన్నారు.

40 పశువుల స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 16: నిబంధనలకు విరుద్ధంగా కంటెయినర్‌లో తరలిస్తున్న 40 పశువులను గొల్లప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 16వ నెంబరు జాతీయ రహదారి మీదుగా అక్రమంగా పశువులు రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు గొల్లప్రోలు మండలం వన్నెపూడి సెంటర్ వద్ద ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. విజయనగరం నుంచి చెన్నై వెళ్తున్న కంటెయినర్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. కంటెయినర్‌తో పాటు 40 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువులు అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడు రాష్ట్రంలోని పోలాచి ప్రాంతానికి చెందిన మహ్మద్ షాన్వా, పాలానిచమి గౌతమ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

160కేవీ జనరేటర్ ప్రారంభం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 16: జనరేటర్ ఏర్పాటు ద్వారా ఫుడ్‌టెక్నాలజీ విభాగంలోని ఫుడ్ టెస్టింగ్ లేబోరేటరీకి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేందుకు వీలు కలుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఆ విభాగంలో రూ.16లక్షల నిధులతో ఏర్పాటుచేసిన 160కేవీ జనరేటర్‌ను శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నమూనా పరీక్షలకు విద్యార్థులు లేబోరేటరీలో ప్రాక్టికల్స్‌చేసే సమయంలో విద్యుత్ నిలిచిపోయినా జనరేటర్ ఏర్పాటుతో ఏ ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి మాలోతు రమేష్, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, జి.శ్యామ్‌కుమార్,సీఈ శ్రీనివాసులు ఉన్నారు.

కాకినాడలో 'న్యాయం కోసం మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 16: జనసేన పీఏసీ సభ్యుడు, కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో సిటీ సహాయ కార్యదర్శి కంటా రవి శంకర్ ఆధ్వర్యంలో అనసూయమ్య మూర్తి కాలనీ, రేచర్లపేటలో దళితులకు న్యాయం కోసం మేము సిద్ధం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శశిధర్ మాట్లాడుతూ దళితులకు 27 పథకాలు తొలగించిన జగన్ ఎవరికీ న్యాయం చేయలేదన్నారు. జనసేన నేత పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వాన్ని నెలకొల్పితే అద్భుతాలు చేస్తారని, తీసేసిన పథకాల ను పునరుద్ధరించడానికి జనసేన తరుపున తాము సిద్ధమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ, అడబాల సత్యనారాయణ, రమణమ్మ, ఉమా పాల్గొన్నారు.

పొన్నాడలో బంగారుపాప ఉరుస్ ఉత్సవాలు ప్రారంభం



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 16: పొన్నాడలో బంగారు పాప ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన హిందూ,ముస్లిం భక్తులు, కాకినాడ డీఎస్పీ కోపల్లె హనుమంతరావు బంగారు పాప దర్శనం చేసుకున్నారు. ఆదివారం వరకు జరిగే ఈ ఉతవాల్లో భక్తులకు ఏ అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులతో డీఎస్పీ చర్చించారు. ఆదివారం గంధోత్సవానికి భారీగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ముజూవర్లు డీఎస్పీకి వివరించారు. భక్తుల సౌకర్యార్థం భోజన వసతి సదుపాయాలు కల్పించామన్నారు.

21 నుంచి భజన పోటీలు

సామర్లకోట, ఫిబ్రవరి 16: మండలంలోని వేట్లపాలెంలో గోదావరి కాలువ ఒడ్డున ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భీష్మ ఏకాదశి ఉత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి 24 వరకూ జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు వెల్లడించారు. మహిళలు, పురుషులు కేటగిరిలలో నిర్వమించనున్న పోటీలను ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు వెంకటేశ్వర స్వామిఆలయం 9441294845లో సంప్రదించాలని కోరారు.

బంగారు పుష్పాలతో అర్చన

పెద్దాపురం, ఫిబ్రవరి 16: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహించారు. ప్రసాదాలను వితరణ చేశారు. అధికంగా భక్తులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని టీడీపీ నేత మృతి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 16: గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మరణించాడు. పట్టణ శివారులోని జగనన్న కాలనీలో నివాసముంటున్న టీడీపీ నేత బత్తుల సుబ్రహ్మణ్యం(49) గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు వద్ద రహదారి దాటుతుండగా గుర్తు తెలియని ఆటో వేగంగా ఢీకొంది. సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మరణించాడు. అతడు చేనేత కార్మికుడిగా పనిచేస్తుండగా భార్య, కుమారుడు ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

పిఠాపురం, ఫిబ్రవరి 16: పిఠాపురం బైపాస్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపాల్‌బాబా ఆశ్రమం నుంచి బైపాస్ రోడ్డు మీదకు నడిచి వస్తున్న వ్యక్తిని బీమ్‌నగర్ నుంచి పాదగయ వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హైవే మొబైల్ పోలీసులు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

ఇద్దరికి గాయాలు

గండేపల్లి, ఫిబ్రవరి 16: మండలంలో మురారి గ్రామం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ధారా వెంకన్న, కటకం శాంతికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం... వెంకన్న, కటకం శాంతి మురారి నుంచి రాజానగరం వెళ్తుండగా వెనుక వస్తున్న బొలేరా వాహనం ఢీ కొనడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ సేఫ్టీ వాహనం సిబ్బంది ట్రాఫిక్ లేకుండా చేసి వారిని ఆసుపత్రికి తరలించారు.

భవనం నుంచి జారిపడిన కార్మికుడు

పెద్దాపురం, ఫిబ్రవరి 16: నిర్మాణంలో ఉన్న భవనం నుంచి జారిపడి ఓభవన నిర్మాణ కార్మికుడు గాయాలపాలైన సంఘటన స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేదులూరి నాగు అనే భవన నిర్మాణ కార్మికుడు నిర్మాణంలో ఉన్న ఓ భవనం నుంచి ప్రమాదవశాత్తూ కాలుజారి కిందకు పడిపోయాడు. దీంతో కార్మికుడు తీవ్రంగా గాయాల పాలయ్యాడు. దీంతో సహచర కార్మికులు ఆసుపత్రికి తరలించారు.